



అక్షరాభ్యాస కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి

ప్రభుత్వ స్కూళ్లలో బంగారు భవిత

» జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

దోమ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని డీఈవో రేణుకాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని మోత్కుర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఎంఈవో వెంకట్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్ ఆధారిత ఏఐ అభ్యసన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పాండు, ఏపీసీ చైర్‌పర్సన్లు రేణమ్మ, సుజాత, అంజనేయులుగౌడ్, బాలరాజు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనసూయ, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షణ క్షణం.. భయం!



» తహసీల్దార్ కార్యాలయం.. శిథిలం

పరిగి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నిజాం కాలం నాటి పరిగి తహసీల్దార్ కార్యాలయ భవనం నేడు శిథిలావస్థకు చేరింది. దాదాపు వందేళ్ల నాటి భవనం కావడంతో లోపలి భాగంలో చెట్లు పెరిగి గోడలకు పగుళ్లు వచ్చాయి. వర్షం కురిస్తే నీరంతా లోపలే ఉండాల్సిన దుస్థితి. ప్రభుత్వానికి ఆదాయ వనరుతోపాటు, పరిపాలన, భూములకు సంబంధించిన దస్త్రాలను సైతం దాచిపెట్టేందుకు కనీసం భద్రత లేని పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడ ఉద్యోగులు సైతం భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్నారు. ఏళ్లుగా ఈ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెబుతున్నారు కానీ అది కార్యరూపం దాల్చడం లేదు. ఇటీవల పరిగికి వచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తహసీల్దార్ కార్యాయల భవన పరిస్థితిని వివరించారు. దీంతో స్పందించిన మంత్రి సత్వరమే పనులు ప్రారంభించండి, నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. అయితే ఈ సారైనా కొత్త భవనం నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





దేశ ఔన్నత్యాన్ని పెంచిన ప్రధాని మోదీ

» బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి




మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

తాండూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విదేశాలు వెళ్లిన భారతీయులంటే గౌరవం పెరిగే విధంగా భారతదేశ ఔన్నత్యాన్ని ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పెంచిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణం ఆర్య వైశ్య కల్యాణ మంటపంలో నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రొఫెషనల్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఫార్మా, వైద్య, ఎలక్ట్రానిక్, మొబైల్ రంగాలతో పాటు అనేక రంగాలలో దేశం దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందన్నారు. మేకిన్ ఇండియాలో భాగంగా దేశంలో ఎన్నో రకాల పరిశ్రమలు నెలకోల్పడంతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, రిటైర్డ్ ఉద్యోగి బసప్ప, మాజీ జిల్లా అధ్యక్షులు సదానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికే కీలకం
కంపెనీల ప్రకటనలతో రైతులు మోసపోవద్దు 5





జిల్లాలో ప్రైవేటు పాఠశాలల వ్యాపారం మూడు యూనిఫాంలు ఆరు పుస్తకాలు అన్న చందంగా సాగుతోంది. మొన్నటి వరకు వేలకు వేల ఫీజులు వసూలు చేసిన ప్రైవేటు విద్యా సంస్థలు నేడు ఏకంగా అనుమతులు లేని సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్ పేరుతో తల్లిదండ్రులను బోల్తా కొట్టిస్తూ అందినకాడికి దండుకుంటున్నాయి. ఒక వైపు విద్యా సంస్థల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయించొద్దని ప్రభుత్వం జీవో ఇచ్చినప్పటికీ అవేవి పట్టించుకోకుండా యథేచ్ఛగా స్కూళ్లలోనే దందా సాగిస్తున్నారు.


ప్రైవేట్ బడి.. దోపిడీ!

సీబీఎస్ఈ పేరుతో కొత్త దందా

- అనుమతులు లేకుండానే అడ్మిషన్లు
- సాధారణ పాఠ్య పుస్తకాలు రూ. 4వేలు..
- సీబీఎస్ఈ సిలబస్ అయితే రూ.10 వేలు
- యూనిఫాం, బుక్స్ ముమ్మరంగా విక్రయాలు
- తల్లిదండ్రులకు భారంగా పిల్లల చదువులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

వికారాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలతో పాటు తాండూరులోని మరో పాఠశాలకు మాత్రమే సీబీఎస్ఈ సిలబస్ కరిక్యులమ్‌కు అనుమతులు ఉన్నాయి. కానీ వికారాబాద్ పట్టణంలోని సెయింట్ ఆంథోని పాఠశాల రెండేళ్లుగా సీబీఎస్ఈ సిలబస్ పేరుతో వ్యాపారం సాగిస్తోంది. 30 మంది విద్యార్థులతో ఒక ప్రత్యేక తరగతిని ఏర్పాటు చేసి ప్రత్యేక సిలబస్ పేరుతో వారి నుంచి రూ. 50 వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. అలాగే రాష్ట్ర సిలబస్ పేరుతో మరో తరగతిని నిర్వహిస్తూ వారి నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తూ పుస్తకాలు, యూనిఫాం సైతం అక్కడే అంటగడుతున్నారు. తాజాగా వికారాబాద్ పట్టణంలోని సెయింట్ జ్యూడ్, శ్రీ చైతన్య, ఆలోక్య, కేశవరెడ్డి తదితర స్కూళ్లు సైతం అదే దారిలో వెళ్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్

మిగతా 6వ పేజీలో...



చర్యలు తీసుకోవాలి



అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. బుక్స్, యూనిఫాం, షూ, ప్రత్యేక సిలబస్‌ల పేరుతో తల్లిదండ్రులను దోచుకుంటున్నారు. స్కూళ్లను దుకాణాలుగా మార్చి నిలువుదోపిడీ చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలి.

-మంచన్‌పల్లి సురేశ్, ఆలంపల్లి

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మను చౌదరి

» ఆశీర్వచనం అందజేసిన కీసరగుట్ట వేదపండితులు



కలెక్టర్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న కీసరగుట్ట వేదపండితులు

మేడ్చల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్లు, డీఆర్‌వో, ఆర్డీఓలు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కీసరగుట్ట వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన కలెక్టర్ గౌతమ్ బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, ఆర్డీవో ఉపేందర్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అలాగే సాయంత్రం టీజీవోఎస్ తెలంగాణ గెజిటెడ్ అధికార సంఘం సభ్యులు నూతన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

గౌతమ్ పోట్రుకు ఘన వీడ్కోలు



జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా అధికారులు

మేడ్చల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి సింగరేణి కాలరీస్ డైరెక్టరుగా బదిలీపై వెళ్తున్న గౌతమ్ పోట్రును శుక్రవారం జిల్లా రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు, డీఆర్‌వో, కలెక్టరేట్ ఏవో రాంమోహన్, ఆర్‌డీఓలు, తహసీల్దార్‌లు వివిధ శాఖల జిల్లా అధికారులు శాలువాలు కప్పి, పూలమొక్కలు అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన మేడ్చల్ కలెక్టరుగా 2023 అక్టోబరు 13న బాధ్యతలు స్వీకరించి ఒక సంవత్సరం 8 నెలల పాటు విధులు నిర్వహించారు.

బడి బస్సులపై రవాణా శాఖ కొరడా!

ముమ్మరంగా కొనసాగుతున్న తనిఖీలు

- ఇప్పటివరకు 11 బస్సులు సీజ్
- మేడ్చల్ జిల్లాలో 4,202 స్కూల్ బస్సులు

మేడ్చల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. దాదాపు రెండు నెలల పాటు విద్యా సంస్థలు మూసి ఉన్నాయి. దీంతో విద్యార్థులను తరలించే బస్సులు మూలకే పరిమితమయ్యాయి. వాటి ఫిట్‌నెస్ పరీక్షల గడువు కూడా మే 15తో ముగిసింది. ఒక వైపు విద్యా సంస్థలు తిరిగి ప్రారంభమైనా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బస్సుల

మిగతా 6వ పేజీలో...



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

మరింత ముమ్మరంగా..



గడువు తీరిన ప్రతీ స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ చేయించుకోవాలి. విద్యాసంస్థల యాజమన్యాలు విధిగా బాధ్యత తీసుకోవాలి. తనిఖీలు మరింత ముమ్మరం చేస్తాం. సామర్థ్య పరీక్షలు చేయించని బస్సుల వివరాలు సేకరించి నోటీసులు ఇస్తాం. పట్టుబడితే సీజ్ చేస్తాం.

-రఘునందన్‌గౌడ్, డీటీవో, మేడ్చల్ జిల్లా



కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి 4
నేర విచారణను వేగవంతం చేయాలి : ఎస్పీ నారాయణరెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ 4

భూ సమస్యలను సదస్సుల్లో పరిష్కరించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



రెవెన్యూ సదస్సులో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను సాధ్యమైనంత వరకు రెవెన్యూ సదస్సులలోనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ఎన్నేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల వివరాల ఆన్‌లైన్ నమోదులో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలన్నారు. ప్రజలు సమర్పించే ప్రతీ దరఖాస్తును స్వీకరించాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం లో ఆర్డీవో వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవసరమైన వారికి చికిత్సలు

వైకల్యం కలిగిన వారిని గుర్తించి శస్త్ర చికిత్సలు చేయిస్తే వారికి గౌరవ ప్రదమైన జీవితాన్ని ఇచ్చిన వారమవుతామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవనంలో ఆకర్ ఆశ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికారాబాద్, పూడూరు మండలాలకు చెందిన వైద్య అధికారులు, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు ముందస్తు వైకల్య పరీక్షలు నిర్వహించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పుట్టుకతోనే కాకుండా ఇతరత్రా కారణాల వల్ల వైకల్యం పొందిన వారిని గుర్తించి శస్త్ర చికిత్సలు చేయించడానికి ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. వైకల్యం ఉన్న వారికి శస్త్ర చికిత్సలతో పాటు ప్లాస్టిక్ సర్జరీలు కూడా ఉచితంగా చేయడానికి ముందుకు వచ్చిన ఆకర్ ఆశ చారిటబుల్ ట్రస్ట్‌ను కలెక్టర్ అభినందించారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రవీణ్, వైద్యాధికారులు శాలిని, నిఖిల్, మహమ్మద్, సౌమ్య, కృప, దేవికలు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కులకచర్ల/కొడంగల్ రూరల్/దుద్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కోసం రైతులు ఈ నెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని కులకచర్ల ఏవో వీరస్వామి, టేకుల్‌కోడ్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి దేవేందర్, దుద్యాల మండల వ్యవసాయ అధికారి నాగరాజు శుక్రవారం వేర్వేరుగా ప్రకటనల్లో పేర్కొన్నారు. కొత్తగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు రైతు భరోసా దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను వ్యవసాయ అధికారులకు అందించాలన్నారు. గతంలో డబ్బులు జమ అవుతున్న వారు దరఖాస్తు చేసుకోనవసరం లేదని పేర్కొన్నారు.

తెరుచుకున్న జంషేడ్‌పూర్ పాఠశాల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

మర్పల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంషేడ్‌పూర్ పాఠశాల 5 మంది విద్యార్థులతో తెరుచుకుంది. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'మూతబడింది' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. దీంతో శుక్రవారం గ్రామంలోని 5 మంది విద్యార్థులతో పాఠశాలను తెరిచారు. అయితే మధ్యాహ్నం ఎంపీవో శ్రీనివాస్ పాఠశాలను సందర్శించగా ఉపాధ్యాయురాలు మధ్యాహ్నం 3:30 గంటలకే వెళ్లిపోవడాన్ని గుర్తించారు. ఆమెకు ఫోన్ చేయగా.. భోజనానికి వెళ్లినట్లు ఉపాధ్యాయురాలు సమాధానం ఇచ్చారు. పాఠశాల సమయానికి ముందే అలా వెళ్లిపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. సమయపాలన పాటించకుంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.


ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

ఆదిభట్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే సంస్థ మునుగడ అభివృద్ధి పథంలో ప్రయాణిస్తుందని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ రాఘవ చెరబుడ్డి అన్నారు. శుక్రవారం సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో 21వ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కాలేజీలో 10, 15, 20 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ఈ సందర్భంగా బంగారు పతకాలు, మెమెంటోలు అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డీన్(అకడమిక్) నయనతార, లాల్‌కిషోర్, శేషగిరిరావు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.











అసౌకర్యాల రైతు వేదికలు

- తాగునీటి సదుపాయం కరువు
- మరుగుదొడ్లు ఉన్నా నిరుపయోగం..
- పరిశుభ్రతా అంతంతే..



చేవెళ్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతు వేదికలు అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు, మెలకువలపై రైతులతో చర్చించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ క్లస్టర్‌కు ఓ రైతువేదిక నిర్మించింది. ఐదు వేల ఎకరాలకు ఓ క్లస్టర్ ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. చేవెళ్ల డివిజన్‌లో మొత్తం 17 రైతువేదికలను నిర్మించి ప్రతీ దానికి రూ.22 లక్షల చొప్పున ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇందులో చేవెళ్ల మండలంలో ఐదు, శంకర్‌పల్లి మండలంలో నాలుగు, షాబాద్ మండలంలో ఆరు, మొయినాబాద్ మండలంలో రెండు చొప్పున పంచాయతీ రాజ్, ఎన్ఆర్ఈజీఎస్‌ల భాగస్వామ్యంలో నిర్మించారు. చేవెళ్ల డివిజన్‌లో నిర్మించిన సంగం రైతు వేదికల్లో నీటి సౌకర్యం లేదు. వేదికల వద్ద మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించినప్పటి నీటి సౌకర్యం కల్పించలేదు. పలు క్లస్టర్లలో మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి కనెక్షన్లు ఇచ్చారు. నల్లాల ద్వారా నీటిని నిలువ చేసుకోవడానికి ఎలాంటి పంప్‌హౌస్‌లు నిర్మించకపోవడంతో నీరు వృథా పోతోంది. రైతులకు కొత్త వంగడాల వివరాలు, తెగుళ్లు సోకినా, భూసార పరీక్షలు తదితర విషయాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలనే ఉద్దేశంతో రైతు వేదికలు ఏర్పాటు చేసినా లక్ష్యం నెరవేరడం లేదనే అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తమవుతోంది. కొన్నిచోట్ల రైతు వేదికలు ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతువేదికలు శుభ్రంగా ఉంచే సిబ్బంది లేకపోవడంతో దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి.

గ్రామాలకు దూరంగా రైతు వేదికలు

సభలు, సమావేశాలకు వస్తున్న అధికారులకు, రైతులకు తాగునీటి వసతి లేకపోవడంతో పాటు రైతు వేదికలు గ్రామాలకు దూరంగా నిర్మించడంతో మహిళా రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. కాగా, నల్లా కనెక్షన్లు ఇవ్వని వాటిలో చాలావరకు గ్రామాలకు దూరంగా నిర్మించారు. కొన్నింటికి ఎలాంటి నీటి సౌకర్యం కల్పించలేదు. ఉన్నతాధికారులు సౌకార్యలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నీటి సౌకర్యం కల్పించాలి



రైతు వేదికలకు వెళ్లి పంట సాగు విషయాలు మాట్లాడుకుందామంటే అసౌకర్యంగా ఉంటోంది. లోపల శుభ్రంగా ఉండటం లేదు. నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాటి. ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి.

- ఎన్.గోపాల్‌రెడ్డి, రైతు, మల్కాపూర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రైతు వేదికల నిర్వహణకు నిధులు నిలిచిపోయాయి.తాగునీటి సౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బంది సైతం లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశాం. త్వరలో సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటాం.

- శంకర్‌లాల్, ఏవో, చేవెళ్ల మండలం

బీజేపీ బలోపేతంపై దృష్టి సారించాలి

యాచారం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం యాచారం మండల బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపుతూ జనాలను మోసం చేస్తుందన్నారు. దివ్యాంగుల పింఛన్లను రూ.6వేలకు, వృద్ధులు, వితంతువుల పింఛన్లను రూ.4వేలకు పెంచుతామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలుపుకోలేకపోతున్నారని మండిపడ్డారు. పంచాయతీలకు ఎన్నికలు జరిపి గ్రామాలను అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి పాలకులకు లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. ఫ్యూచర్‌సిటీ పేరుతో మున్సిపాల్టీ ఏర్పాటు చేస్తారా అనే అనుమానం కలుగుతుందన్నారు. అంతకుముందు విమాన ప్రమాదంలో


సమావేశంలో మాట్లాడుతున్న అంజన్‌కుమార్ గౌడ్

మరణించిన మాజీ సీఎం విజయ్‌రూపాణి మృతికి సంతాప సూచకంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొప్పు బాషా, విజయ్‌నాయక్, తాండ్ర రవీందర్, డేరంగుల రాజు, శేఖర్, జి.రమేష్‌జీ, పి.శ్రీశైలం. మేకల యాదగిరిరెడ్డి తదితరులున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి/పూడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి విడత, రెండో విడత కలిపి మొత్తం ఏడు వేల ఇళ్లు వచ్చాయన్నారు. ఇళ్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దని, దశలవారీగా ప్రతి ఒక్కరికీ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఈ.కృష్ణ, మాజీ వైఎస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, నాయకులు తాపుర్యానాయక్, వెంకట్రాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు లేని రాష్ట్రమే లక్ష్యం

గుడిసెలు లేని రాష్ట్రం కావాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పూడూరు మండల కేంద్రంలోని


లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

రైతు వేదికలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూడూరు మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి మొత్తం 306 ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందించినట్లు తెలిపారు. ఘట్టేపల్లి గ్రామ సమీపంలో సబ్ స్టేషన్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, షకీల్, పెంటయ్య, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.


వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్

వేంకటేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే

శంషాబాద్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. జన్మదినం సందర్భంగా డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి ఆశీస్సులతో జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో కలిసి వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, బోజిరెడ్డి, అనేగౌని శ్రీధర్‌గౌడ్, చంద్రన్‌గుట్ట శ్రీనివాస్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

- చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం

మొయినాబాద్ రూరల్; జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మొక్కలునాటి వాటిని సంరక్షించుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం తెలిపారు. శుక్రవారం మొయినాబాద్ మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామంలో తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా కెఎస్. రత్నం ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్నతల్లి, ఆత్మీయుల పేరు మీద మొక్కలు నాటి వాటిని సంరక్షించుకునే కార్యక్రమం మొయినాబాద్ మండలంలో ప్రారంభించడం జరిగిందన్నారు. పచ్చదనం పరిశుభ్రతచాలా అవసరం అన్నారు. కార్యక్రమంలో కంజర్ల ప్రకాశ్, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వీరేష్, కిషన్, మాధవరెడ్డి, రాజు, జగపతి, గణేష్ , శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.


తోల్‌కట్టలో మొక్కలు నాటుతున్న నాయకులు

కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి

-ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్/కులకచర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పోలీస్ అధికారి కొత్త చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో అధికారుల కోసం ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కొత్త చట్టాల ఉద్దేశం శిక్షించడం మాత్రమే కాదని, బాధితులకు సత్వర న్యాయం అందించడమేనని ఆయన స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేర విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కులకచర్ల పీఎస్ సందర్శన

అలాగే ఎస్పీ నారాయణరెడ్డి కులకచర్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. నేరాలఅదుపులో సిబ్బంది ముందుండాలని సూచించారు.


కులకచర్ల పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

గ్రామాల్లో నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతీగ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. గంజాయి, రేషన్‌బియ్యం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైరమేశ్, పోలీసుసిబ్బంది ఉన్నారు.

ఆమె దారెటు?

చర్చనీయాంశంగా మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ స్వప్న వ్యవహారం

తాండూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న చేసిన ప్రసంగం చర్చకు దారి తీసింది. శుక్రవారం తాండూరు పట్టణంలో ప్రధాని మోదీ ప్రభుత్వం 11సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రొఫెషనల్ మీట్ కార్యక్రమంలో పాల్గొని ప్రధానిని పొగడుతూ మాట్లాడారు. ఈ ప్రసంగం తాండూరు పట్టణంలో అటు అధికార కాంగ్రెస్ పార్టీలో, ఇటు బీజేపీలో చర్చనీయమైంది. ప్రధానిగా మోదీ లేకుంటే రామ మందిరం నిర్మాణం జరిగి ఉండేది కాదేమోన్నారు. మోదీ పాలన నాభూతో నా భవిష్యత్తు అన్న విధంగా పార్టీలకతీతంగా పాలన చేస్తున్నారని పొగడ్తలతో ముంచెత్తారు. ప్రస్తుతం స్వప్న అధికార కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. కాంగ్రెస్‌లో ఎవరికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు అన్న


మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న

విషయంపై చర్చ నడుస్తోంది. మరోవైపు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కార్యక్రమాలు తాండూరు పట్టణంలో కొనసాగుతుండగా అందులో పాల్గొనకుండా ప్రొఫెషనల్ కార్యక్రమంలో పాల్గొనడం రెండు పార్టీల్లో చర్చనీయాంశమైంది. ప్రసుత్తం మాజీ చైర్‌పర్సన్ వ్యవహారం ఎవరికీ అంతు చిక్కడం లేదు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాగరాజు, మహేశ్

మోదీ పాలనలో అద్భుత విజయాలు

కడ్తాల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనా దక్షతతో 11ఏళ్లలో దేశం అద్భుత విజయాలు సాధించిదని, దేశాభ్యున్నతికి మోదీ సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో మైసిగండి గ్రామంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంటేకార్ భగీరథ్, సాయిలాల్ నాయక్, లక్ష్మణ్‌నాయక్, శ్రీశైలం గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాలకృష్ణ గౌడ్, రెడ్యానాయక్, శంకర్‌నాయక్, రవీందర్ రెడ్డి, వెంకటేశ్,సంతోష్, వెంకటేశ్ యాదవ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

ఘనంగా గురునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కొడంగల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కొడంగల్‌లో మైనారిటీ నాయకులు ఎస్‌ఎం.గౌసస్ ఆధ్వర్యంలో గురునాథ్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అహ్మద్‌ఖాన్, నూర్‌ఖాన్, సయ్యద్ వాహేద్, రహమత్‌ఖాన్, మొహ్మద్ రహీం, సయ్యద్ ఖాలీద్, ఇంతియాజ్, డాక్టర్ నజీరుద్దీన్ తాహేర్, మొహ్మద్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నగుడి నిర్మాణానికి విరాళం

చేవెళ్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న మల్లన్నగుడి నిర్మాణం కోసం చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి సమతారెడ్డి దంపతులు, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి దంపతులు రూ.30 లక్షలు విరాళం అందించారు. ఈమేరకు శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, చేవెళ్ల గ్రామస్థులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

చేవెళ్ల, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): ప్రైవేట్ పాఠశాలలో ఎక్కువ ధరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులను అమ్ముతున్నారని, విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం అధిక ధరలకు అమ్ముతూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాజేశ్, మండలాధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఇస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందిన వారికి సీఎంఆర్‌ఎఫ్ వరంలా మారిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం షాద్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో 13 మందికి మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మైనిక హరికృష్ణగౌడ్, రామకృష్ణ, తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, బాబురావు, రవీందర్‌రెడ్డి, జేకే నర్సింహులు, ఎజాజ్, దర్గా రామచంద్రయ్య, జనార్థన్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జిగా మోహన్‌సింగ్ నాయక్



షాద్‌నగర్ అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్టీ మోర్చా షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మోహన్‌సింగ్ నాయక్ నియమితులైనారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రధాని నరేంద్రమోదీ అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి, బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మోహన్‌సింగ్ తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించేందుకు సహకరించిన కళ్యాణ్‌నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలకు మోహన్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చౌదరిగూడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాలలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోడ్డు సౌకర్యం బాగుంటేనే రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా నిధులు మంజూరు చేస్తూ గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, వెంకటయ్య, మహేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

16న రైతు వేదికలను ప్రారంభించనున్న సీఎం

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్న 35 రైతు వేదికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతు వేదికల ప్రారంభోత్సవం సందర్భంగా రైతులతో సీఎం మాట్లాడే అవకాశం ఉందని, గ్రామాల నుంచి వచ్చే వారికి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం వైద్యశాఖ, మున్సిపల్ సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రచ్చకట్ట వద్ద డాక్టర్ మంజులాదేవితో కలిసి ర్యాలీని కమిషనర్ శంకర్ నాయక్ ప్రారంభించారు. ప్రధాన కూడళ్లలో సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ పాఠశాల వద్ద ఎస్‌వో పద్మజ్యోతి, ఉపాధ్యాయినీలు, విద్యార్థినీలతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని శంకర్ నాయక్ కోరారు. పాఠశాలల్లో పరిసరాలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. ఆయా కార్యక్రమాలలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికే కీలకం

» కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు

» గుర్తింపు పొందిన సీడ్స్‌తో మేలు

» నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

చేవెళ్ల,జూన్13 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రుతుపవనాలు వారం ముందుగానే వస్తుండటంతో వానాకాలం సీజన్ ప్రారంభమైంది. రైతులు విత్తనాలు, ఎరువులు, సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో వివిధ కంపెనీలు విత్తనాలు, పురుగుల మందులు విక్రయించేందుకు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో రైతులు మోసపోకుండా నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు.. ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను తమ వైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒకటి రెండు సార్లు ఆలోచించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. నకిలీ, నాసిరకం విత్తనాలు పెద్దఎత్తున మార్కెట్లో లభ్యమవుతుంటాయి. రైతులు కంపెనీల వలలో పడి విత్తనాలు కొనడం, ఆ తరువాత మోసపోవడం షరా మామూలైంది. చేవెళ్ల డివిజన్‌లో అరు



ఫర్టిలైజర్ షాపులో విక్రయానికి ఉంచిన విత్తన ప్యాకెట్లు

తడి పంటల సాగులో పత్తిది మొదటి స్థానం. ముఖ్యంగా పత్తి విత్తనాలకు సంబంధించిన పలు కంపెనీలు గ్రామాల్లో రైతులను ఆకట్టుకునేలా వాహనాల్లో వచ్చి కరపత్రాలు, మైక్‌సెట్ల ద్వారా ప్రచారాలు సాగిస్తున్నారు. తొందరపడి కొనుగోలు తర్వాత నాసిరకం అయితే విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకెత్తినా పంట దిగుబడి తగ్గిపోవడంతో రైతుల శ్రమ వృథా అవుతుంది. ఈక్రమంలో కొందరు రైతులు ఆత్మహత్యకు పాల్పడి ఘటనలూ ఉన్నాయి. నకిలీ విత్తనాలు విక్రయించే కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది నామమాత్రమే. దీనితో నకిలీ విత్తనాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది.

నేల స్వభావాన్ని బట్టి ఎరువులు

నేల స్వభావాన్ని బట్టి పైరు ఎదుగుదల, చీడ పీడల ఉధృతి ఉంటుంది. కాబట్టి భూమి పోషక విలువలను బట్టి ఎరువులు, పురుగుల మందులు వేయడం ఉత్తమం. ఒకరిని చూసి మరొకరు ఒకే రకం పంటలు, విత్తనాలు వేయడం ఎరువులు, పురుగుల మందులు వేయకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు సాగు చేస్తే మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం ఉత్తమం.
- విత్తనాల కొనుగోలు బిల్లుపై నంబరు, విత్తనం రకం, కొనుగోలు తేదీ, డీలర్ల సంతకం, రైతు సంతకం, కొనుగోలు బిల్లుపై ఉండేలా చూసుకోవాలి.
- గడువు దాటిన విత్తనాలు, వదులుగా ఉన్న ప్యాకెట్లు, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాలలో ఉన్నవి అస్సలు కొనుగోలు చేయవద్దు.
- బిల్లులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్ను నంబర్లు, విక్రయదారుడి పేరు, సంతకం, తేదీ, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, నికర ధర, కంపెనీ పేరు తప్పని సరిగా నమోదు చేయాలి.
- విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలు తీసుకొనివాటిలో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా చదవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలరు వద్ద తూకం వేయించాలి.
- విత్తనాలు మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులు లేదా, శాస్త్రవేత్తలను సంప్రదించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకూ జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే మొలక శాతాన్ని చూసుకోవాలి. ఆ తరువాత మొలక శాతం సంతృప్తిగా ఉన్న వాటిని విత్తనాలుగా వాడాలి.

క్రిమిసంహారక మందు ఎంపికలో..

- పంట సాగులో చీడ పీడల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఏదో ఒక రకం క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తుంటారు. అలా కాకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచన మేరకు మాత్రమే మందులు కొనుగోలు చేసి వాడాలి.
- పురుగుల మందులు రెండు, మూడింటిని కలిపి వాడకూడదు. వాడిన మందుల డబ్బాలను, సీసాలు ధ్వంసం చేసి భూమిలో పాతిపెట్టాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయాధికారుల సహకరంతో ఎరువులను పరీక్షించుకోవాలి.

వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలి

రైతులు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. గ్రామాల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి విత్తనాలు అమ్మితే కొనుగోలు చేయవద్దు. అలాంటి వారిపై వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలి. మేలురకం విత్తనాలనే ఎంపిక చేసుకొని మంచి దిగుబడి సాధించాలి.

\- సురేష్ బాబు, ఏడీఏ, చేవెళ్ల

నిరుద్యోగ యువతకు 'ఉపాధి' శిక్షణ కోర్సులు

శంషాబాద్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్కిల్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా నిరుపేద, నిరుద్యోగ యువతకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ చేయూతనందిస్తుందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్టు క్యాంపస్‌లోని స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రస్తుతం పాఠశాల, కళాశాల డ్రాపౌట్ అయినవారికి 5 విభిన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా నిరుద్యోగ యువతకు వసతి, భోజనం సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఆటోమొబైల్ రిపేర్, ఎక్సకవేటర్ ఆపరేటర్,డ్రైవాల్స్ అండ్ ఫాల్స్ సీలింగ్ టెక్నీషియన్, వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ టెక్నీషియన్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా కోర్సుల్లో పరిమిత సీట్లు ఉండటంతో ఆసక్తి గలవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9912973086, 8985800102 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తులకు ఈనెల 20 వరకు గడువు ఉందన్నారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

చేవెళ్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్ పాస్ చార్జీలను తక్షణమే తగ్గించాలని ఏబీవీపీ శంషాబాద్ బాగ్ కన్వీనర్ కావలి శివ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బస్‌పాస్ చార్జీల పెంపుతో విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. చాలామంది పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలన్నారు. లేనిచో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

» ఐదుగురి నిందితుల అరెస్ట్



ఘట్‌కేసర్ రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్న ముఠాను ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సఫిల్‌గూడకు చెందిన వేముల జాన్(29), ఈసీఐఎల్‌కు చెందిన మోహన్‌వెంకట్(29), చెంగిచెర్లకు చెందిన మనీస్ ఉపాధ్యాయ్(26), విశాల్(21), మౌలాలికి చెందిన రవి తేజ(27) గుట్టుచప్పుడు కాకుండా ఒడిశా రాష్ట్రం, కోరాపూట్ జిల్లా, సుంకీ గ్రామానికి చెందిన జైన్‌మామా నుంచి గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మౌలాలీ, ఈసీఐఎల్, చెంగిచెర్ల తదితర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు చిన్న చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. వారివద్ద నుంచి 10 కిలోల గంజాయితో పాటు కారు, రెండు బైకులు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం 5 మంది నిందితులను రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న జైన్‌మామాను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.



వేలంపాట నిర్వహిస్తున్న ఈవో నరేందర్

వీరభద్రేశ్వరుడి భూమి కౌలుకు వేలం

ధారూరు, జూన్13(ఆంధ్రజ్యోతి): ధారూరులోని శ్రీ వీరభద్రేశ్వర ఆలయ భూమి కౌలు కోసం శుక్రవారం ఆలయ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. సర్వే నంబరు 191లో 0-39 ఎకరాలు, సర్వే నంబర్ 193లో 7-08 ఎకరాలు ఆలయ భూమికి దేవాదాయ శాఖ ఈవో నరేందర్ ఆధ్వర్యంలో కౌలు వేలంపాట పాడారు. వేలంపాటలో మండల పరిధిలోని హరిదాసుపల్లి గ్రామానికి చెందిన జి.రవి రూ.76 వేలు పాట పాడి దక్కించుకున్నారు. కౌలు వేలంపాట దక్కించుకున్న రైతు ఏడాదికి రూ.76వేల చొప్పున మూడు సంవత్సరాల వరకు చెల్లించాల్సి ఉంటుందని ఈవో నరేందర్ పేర్కొన్నారు. అయితే ఆలయ భూమిని సర్వే చేయించాలని స్థానికులు దేవాదాయ శాఖ ఈవోను కోరారు. రికార్డు ప్రకారం 8-07 ఎకరాలు ఉందని, వాస్తవంగా అక్కడ ఆరెకరాల భూమే ఉందని, దాదాపు 2 ఎకరాలు కబ్జాకు గురైందని ఈవోకు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులుగా ప్రణీత్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ ముదిరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడాలి



చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళపల్లికి చెందిన కొప్పు మల్లేశ్‌కు మంజూరైన రూ.51వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో లబ్ధిదారుడికి అందజేశారు. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. నాయకులు గొర్రె పవన్ కుమార్‌రెడ్డి, ఐజాక్, సుభాష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో ఖమ్మం విజయవంతం చేయండి



పరిగిలో ఖమ్మం సభకు సంబంధించి పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పరిగి,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జూన్ 15న ఆదివారం నిర్వహించ తలపెట్టిన గిరిజన హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు పి.గట్యానాయక్ కోరారు. ఖమ్మం సభకు సంబంధించి శుక్రవారం పరిగిలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో లంబాడాల సంఖ్యను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల రిజర్వేషన్లను 14 శాతానికి పెంచాలని కోరారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. గిరిజనుల హక్కుల కోసం నిర్వహిస్తున్న ఖమ్మం సభకు జిల్లా నలుమూలల నుంచి గిరిజనులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గట్యానాయక్, పాండునాయక్, హరినాయక్, రవీందర్‌నాయక్, బాలకృష్ణ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం అభివృద్ధికి అఖిలపక్షం



మాట్లాడుతున్న వెంకటేశం

బంట్వారం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బంట్వారం మండల పునర్నిర్మాణంపై అఖిల పక్షం ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విలేకరులతో మాట్లాడుతూ.. మండలం కేవలం ఏడు గ్రామ పంచాయతీలతో కొనసాగగా మరో నలుగు కొత్త గ్రామ పంచాయతీలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అయితే మండలం చిన్నగా కావడంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఈ మండలానికి పక్క మండలాల్లోని పలు గ్రామాలను చేర్చాలని కోరారు. దీనిపై త్వరలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. ఈ విషయంపై అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి, పురుషోత్తం, నర్సింహులు, నర్సింహారెడ్డి, హరిశ్వర్ రెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన

» తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు, సాంకేతిక బోధనను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాత తాండూరులోని బాలికల ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం, మోమిన్‌గల్లిలో నంబర్ -2 పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, నాయకులు సంపత్ కుమార్, అబ్దుల్ రవూఫ్, ప్రభాకర్ గౌడ్, రామకృష్ణ పట్లోళ్ల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

బషీరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొర్విచెడ్‌ఘని సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేశ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మట్లాడుతూ మండలానికి మొదటి విడతగా 661 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మోహన్‌బాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, మాజీ జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్లు అజయ్ ప్రసాద్, చందర్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ రామునాయక్, జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ బి.శంకరప్ప, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో చిన్నారికి అక్షరాలు దిద్దిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

యాలాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 600 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు నాలుగు విడతల్లో బిల్లులు పడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమేష్ మహరాజ్, సంపత్, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ బడి.. దోపిడీ!

(మూడో పేజీ తరువాయి)

కలిపి 50 వరకు కార్పొరేట్ పాఠశాలలు నడుస్తుండగా అన్ని పాఠశాలలో యథేచ్ఛగా బుక్స్, దుస్తులు, సీబీఎస్ఈ పేరుతో దందా చేస్తున్నాయి. పాఠశాలలకు దూరంగా షటర్లను అద్దెకు తీసుకుని పుస్తకాలు, యూనిఫాం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కొన్ని స్కూళ్లు జనరల్ స్టోర్, దుస్తుల దుకాణాలతో ఒప్పందం కుదుర్చుకొని విక్రయాలు కొనసాగిస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే 25 శాతం పెంచి పాఠశాల తరుపున విక్రయాలు చేస్తున్నారు. ఇంత వ్యాపారం జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడని పరిస్థితి.

పక్క రాష్ట్రాల నుంచి టీచర్లను తీసుకొచ్చి..

సీబీఎస్ఈ సిలబస్‌కు సంబంధించి ఉండాల్సిన నిబంధనలే ఏ పాఠశాల పాటించడం లేదు. విశాలమైన భవనం, పాఠశాలలో పదో తరగతితో పాటు ఇంటర్ విద్య, విశాలమైన గ్రౌండ్‌తో పాటు జాతీయ స్థాయి అనుమతులు పొంది ఉండాల్సి ఉంటుంది. ఇవి ఏవీ లేకుండానే ఎలాంటి అనుమతులు రాకుండానే సీబీఎస్ఈ కరిక్యులమ్ అని చెప్పడంతో పాటు ఆ బుక్స్‌ను సైతం పాఠశాల వారే తయారు చేసి ధరలు పెంచి అమ్ముతున్నారు. పక్కా రాష్ట్రాల నుంచి టీచర్లను తీసుకొచ్చి ఈగో ఆగో అంటూ వారిని చూపిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు.

స్కూల్‌కు ఒక రకంగా ఫీజులు

ఒక్కో స్కూల్‌లో ఒక్కో విధంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీకి ఫీజు రూ.20 వేల నుంచి 30 వేల వరకు వసూలు చేస్తున్నారు. అలాగే పుస్తకాలకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. పై తరగతులకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఫీజుతో పాటు రూ.7 - రూ.10 వేల వరకు బుక్స్‌కు వసూలు చేస్తున్నారు. కాగా, సీబీఎస్ఈ సిలబస్ పేరుతో మరో 30 శాతం అదనంగా దండుకుంటున్నారు.

చేతులు చాస్తున్న పలు విద్యార్థి సంఘాలు

పాఠశాలలు విద్యార్థుల జీవితాలతో దందా చేస్తుంటే పలు విద్యార్థి సంఘాలు వారి వద్ద చేతులు చాస్తున్నాయి. జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలలతో పాటు బడ్జెట్ పాఠశాలల వద్దకు వెళ్లి మరీ తమ సంఘం పేరుతో డబ్బులు తీసుకుంటున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా పలు పాఠశాలలు నడుపుతూ విద్యాశాఖలో పనిచేస్తున్న అధికారులకు సైతం ముడుపులు ముట్టజెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత తతంగం బహిరంగా జరుగుతున్నా తమ వద్దకు ఫిర్యాదులు వస్తేనే చర్యలు తీసుకుంటామని చెబుతుండటం గమనార్హం.

రెండు స్కూళ్లకే సీబీఎస్ఈ అనుమతులు



జిల్లా వ్యాప్తంగా రెండు స్కూళ్లకు మాత్రమే సీబీఎస్ఈ అనుమతులు ఉన్నాయి. మిగితా ఏ పాఠశాల కూడా సీబీఎస్ఈ పేరుతో అడ్మిషన్లు తీసుకుంటే చర్యలు తీసుకుంటాం. పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు చేయొద్దని ఇప్పటికే ఆదేశాలున్నాయి. అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తప్పవు. స్వయంగా నేనే వెళ్లి పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటా.

-రేణుకాదేవి, డీఈవో, వికారాబాద్

బడి బస్సులపై రవాణా శాఖ కొరడా

(మూడో పేజీ తరువాయి)

ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి కాలేదు. దీంతో రవాణా శాఖ అధికారులు రంగంలో దిగారు. తనిఖీలు ముమ్మరం చేసి ఇప్పటివరకు 11 బస్సులను సీజ్ చేశారు. బస్సులకు ఫిట్‌నెస్ లేకపోవడం, పన్నులు చెల్లించకపోవడం, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా నడుపుతున్న బస్సులపై రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహించి తనిఖీలు చేస్తున్నారు.

నామమాత్రంగానే తనిఖీలు

ఏటా విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ముందే బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంటుంది. బీమా, కాలుష్యం తదితర పత్రాలు తప్పనిసరిగా వాహనంలో ఉండాలి. జిల్లా వ్యాప్తంగా 4,202 విద్యాసంస్థల బస్సులు ఉన్నాయి. కాగా, ఇప్పటివరకు 3,737 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తి చేశారు. ఇంకా 485 బస్సులకు ఫిట్‌నెస్ చేయించాల్సి ఉంది. గురువారం నుంచి విద్యాసంస్థలు కూడా ప్రారంభమయ్యాయి. బస్సులను పూర్తిగా పరిశీలించకుండా దీంతో నామమాత్రంగానే తనిఖీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చాలా బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సులు లేకపోవడం, ఇండికేటర్లు పగిలిపోయి ఉండటం కనిపిస్తుంది. అలాగే బస్సుపై పూర్తి వివరాలు కనిపించడం లేదు. నిబంధనలు పాటించకుండా కొన్ని పాఠశాలల యాజమాన్యాలు తమ బస్సులు ఇష్టానుసారంగా నడిపిస్తున్నాయి.



మోమిన్‌పేట్: చిన్నారులతో అక్షరాభ్యాసం



మేడ్చల్ టౌన్: ఎంపీపీఎస్‌లో..



కులకచర్ల: బొంరెడ్డిపల్లిలో అక్షరాభ్యాసంలో ఎంఈవో హబీబ్ అహ్మద్

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని విద్యాధికారులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కాగా శుక్రవారం పాఠశాలల్లో పిల్లలతో అక్షరాభ్యాసాలు చేయించారు. పలు పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికి అడ్మిషన్ తీసుకున్నారు. ఎంఈవోలు, హెచ్ఎంల ఆధ్వర్యంలో విద్యార్థులు నోట్ బుక్కులు, యూనిఫాం అందజేశారు. పలుచోట్ల దాతలు, నాయకులు పెన్నులు, స్టేషనరీని అందజేశారు. ఆయా చోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో స్థానిక నాయకులతోపాటు గ్రామస్తులు, పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి)



కొడంగల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో రాంరెడ్డి



ధారూరు: వీరభద్రేశ్వర ఆలయంలో..



పరిగి: బాలికల ప్రాథమిక పాఠశాలలో..



ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లో..



పూడూరు: కంకల్‌లో విద్యార్థులతో అక్షరాలు దిద్దిస్తున్న ఉపాధ్యాయులు



ఘట్‌కేసర్ రూరల్: యూనిఫాంలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం రవికుమార్



బషీరాబాద్: రెడ్డిఘణాపూర్ పాఠశాలలో పుస్తకాలు, బ్యాగులతో విద్యార్థులు

దుర్వాసన నుంచి విముక్తి



బొంరాస్‌పేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏళ్లుగా దుర్వాసన భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల చుట్టూ ఉన్న ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు పాఠశాల వెనక భాగంలో పేరుకుపోయింది. మురుగునీరు వెళ్లేందుకు శుక్రవారం ముదిరాజ్ గ్రామ సంఘం నాయకులు జేసీబీ సహాయంతో తొలగించారు. మురుగు నీరు కాల్వ ద్వారా వెళ్లిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

పారిశుధ్యంతో వ్యాధుల నియంత్రణ



మాట్లాడుతున్న నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కీసర రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను అరికట్టవచ్చని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని రచ్చ రాంరెడ్డి ఫంక్షన్‌హాల్ తడి, పొడి చెత్త నిర్వహణ, తపాల శాఖలోని పొదుపు పథకాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను ఎరువుగా మార్చి ఆదాయం పొందవచ్చన్నారు. సమతుల ఆహారం తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్ సురేష్‌రెడ్డి, ఎన్ఐఎన్ టెక్నికల్ ఆఫీసర్ పాండా, మెప్మా ప్రతినిధులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

గుడిని ఢీకొట్టిన వాహనం

పాక్షికంగా దెబ్బతిన్న గోడ

యాలాల, జూన్ 13, (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత ఆలయాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటన యాలాల మండల కేంద్రంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని గ్రామ దేవత ఆలయాన్ని శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆలయం గోడ పైభాగం పాక్షికంగా ధ్వంసమైంది. ఈ ఘటనతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు పాల్పడిన వాహనదారులు బాధ్యత వహించి మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

పరిగి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. పరిగి మునిసిపల్ పరిధిలోని సయ్యద్‌మల్కాపూర్ గ్రామానికి చెందిన ప్యాట నర్సింహులు(30), గురువారం రాత్రి గ్రామ శివారులోని పెంట్రోల్ పంపు దగ్గర రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

దోమ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని బొంపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన అప్పగాల్ల చంద్రయ్య పొలం దగ్గర ఎద్దు మేత మేసుకుంటూ వెళ్లి అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ తీగకు తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ దాదాపు రూ.90వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని బాధిత రైతు వేడుకున్నాడు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ఘట్‌కేసర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సిబ్బంది ఆరోగ్య పరిక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఆర్‌ఓ కవిత అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 100రోజుల కార్యక్రమంలో భాగంగా ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

రాజీమార్గమే రాజమార్గం

దౌల్తాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే..రాజమార్గమని దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ అన్నారు. శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు.

ముమ్మరంగా రెవెన్యూ సదస్సులు

నవాబుపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి నూతన చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆర్డీవో వాసుచంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని మాదిరెడ్డిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ నెల 20 వరకు గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ బుచ్చయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 20 అర్జీలు

తాండూరు రూరల్: కొత్లాపూర్, గుంతబాస్పల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. కొత్లాపూర్‌లో జరిగిన సదస్సులో తాండూరు తహసీల్దార్ తారాసింగ్ పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించిన తర్వాత పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగదీశ్వర్ పాల్గొన్నారు.

పరిగి: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పరిగి తహసీల్దార్ ఎం.ఆనంద్‌రావు అన్నారు. మండల పరిధిలోని రంగంపల్లి, బాబాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు. మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. అలాగే కొడంగల్‌లో జరిగిన సదస్సులో తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు.

బొంరాస్‌పేట్‌లో

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. మండలంలోని బురాన్‌పూర్‌లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 92 అర్జీలు వచ్చాయి.



నవాబుపేట: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారం కోసమే..

యాలాల: భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని యాలాల తహసీల్దార్ వెంకటస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని బెన్నూరు, హాజీపూర్ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆర్ఐ వేణుతో కలిసి అర్జీలు స్వీకరించారు. బెన్నూరులో 4, హాజీపూర్‌లో 3 అర్జీలు వచ్చాయని తెలిపారు.



తాండూరు రూరల్: కొత్లాపూర్‌లో..




పరిగి: రంగంపల్లి సదస్సులో తహసీల్దార్ ఆనంద్‌రావు



యాలాల: అర్జీని స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం

పరిగి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో మెహరున్నిసాబేగం అన్నారు. అమ్మ మాట - అంగన్‌వాడీ బాటలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని రాపోల్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు.



రాపోల్‌లో అమ్మ మాట, అంగన్‌వాడీ బాట

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉజ్వల, అంగన్‌వాడీ టీచర్లు బాలమ్మ, స్వప్న పాల్గొన్నారు.


వృద్ధుల హక్కులను కాపాడాలి



ఘట్‌కేసర్‌లో నిరసన తెలుపుతున్న సీనియర్ సిటిజన్స్

ఘట్‌కేసర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలో వయోవృద్ధుల కోసం పొందుపర్చిన హక్కులను ప్రభుత్వాలు అమలు చేయాలని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అసోసియేషన్ మండల అధ్యక్షుడు తోట రంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు ఆర్టీసీ బస్సుల్లో 50శాతం రాయితీ కల్పించాలని, రైల్వే రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉరెల్లి వెంకట్‌రాంరెడ్డి, మల్లారెడ్డి, యాదిరెడ్డి, రాజయ్య, వేణుమాధవ్, పృథ్వీరాజ్, రాజిరెడ్డి, సోమయ్య, జగదీశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, నర్సయ్య, పోచిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో జోరుగా అడ్మిషన్లు



బొంరాస్‌పేట్: అడ్మిషన్‌లు తీసుకుంటున్న విద్యార్థులు

బొంరాస్‌పేట్, , జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలు ఎంత ప్రచారం నిర్వహించినా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత బాలుర, బాలికల పాఠశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు తల్లిదండ్రులు పిల్లలతో పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో సందడి నెలకొంది.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

మోమిన్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులున్నాయని ప్రధానోపాధ్యాయుడు దండు రమేశ్ అన్నారు. శుక్రవారం ఆయన ఏబీఎన్‌తో మండలంలోని ఎన్కతల పాఠశాలలో మాట్లాడారు. బడిబాట కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న తరుణంలో మీ పిల్లలను ఎందుకు ప్రభుత్వ పాఠశాలలో చదివించడం లేదని ప్రశ్నించడంతో తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 12 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరినట్లు తెలిపారు. అధికారులు తమ పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లతో పాటు చిన్న చిన్న మరమ్మతులు చేయించాలని కోరారు.

పాఠశాల ఆవరణలో చెట్ల నరికివేత

మర్పల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మొక్కలు నాటాలని ఆదేశిస్తున్నా.. గుండ్లమర్పల్లి పాఠశాల ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్లను ఉపాధ్యాయుడు నరికి వేయించాడు. మర్పల్లి మండలంలోని గుండ్లమర్పల్లి పాఠశాల ఆవరణలో చెట్టు కొమ్మలు కిందికి వేలాడుతున్నాయని ఎలాంటి అనుమతులు లేకుండానే ఉపాధ్యాయుడు రఫీ నరికేయడంతో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్లను ఎందుకు నరికారని అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

కులకచర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం కులకచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కొత్తగా ప్లే స్కూల్స్ ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు జామ్ అవుతున్నాయ్..



వినతిపత్రం ఇస్తున్న గుండ్లపోచంపల్లి వాసులు

మేడ్చల్ టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ల నుంచి వెలువడే మురికి నీటి పైప్‌లైన్లను కాలనీల్లో ఏర్పాటు చేసిన డ్రైనేజీ లైన్‌లకు కలిపితే జామ్ అయ్యి ఇబ్బందులు పడుతున్నామని గుండ్లపోచంపల్లి పరిధిలోని మాణిక్యరెడ్డి నగర్ కాలనీవాసులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ స్వామినాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అపార్ట్‌మెంట్ల డ్రైనేజీ లైన్లను కాలనీల లైన్లతో కలపొద్దని కోరారు. కాలనీలో సామర్థ్యం తక్కువున్న డ్రైనేజీలలోకి అపార్ట్‌మెంట్ల లైన్లు కలిపితే తరుచూ లైన్లు జామ్ అవ ుతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో కాలనీవాసులు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, అమరం జైపాల్ రెడ్డి, హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.

సాగు ఖర్చు తగ్గించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జూన్13(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవాలని వ్యవసాయ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ బలరాం అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అవుశాపూర్, అంకుశాపూర్‌లలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం జరిగింది. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీనివాస్, సుధారాణి, మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈవో జగదీష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి

కొడంగల్ రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉషశ్రీ అన్నారు. గురువారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైలెట్ గ్రామంగా అన్నారం ఎంపికైందన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాల ఆవరణలో నర్సరీని పరిశీలించారు. ఎంపీఓ జైపాల్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

దుద్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్లపల్లి పంచాయతీ పరిధిలోని నాన్యనాయక్ తండాలో శుక్రవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు అధికారులు, నాయకులు ప్రొసీడింగ్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వరుణ్, పంచాయతీ కార్యదర్శి కిషన్‌నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్, హనీబాయి, హన్మనాయక్, రాహుల్, రతన్‌నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.